*మమతల చివుళ్ళు యెండిన కొమ్మలను ఏ గాలీ కదల్చలేదు. ఆ జీవచైతన్యం చావని కొమ్మ ప్రతిగాలికీ కంపిస్తుంది. అందుకే.... ఒకరికి 'విశేషం'గా కనిపించనిది మరొకరికి యెదురుచూసే "విశేషం" కావడం!*

మూడో పిరియడ్ ముగిసింది.

డిపార్టుమెంట్ కొచ్చి, నీరసంగా కుర్చీలో కూలబడి, ఒక గ్లాసు మంచినీళ్ళు తాగి, సిగరెట్ ముట్టించి, లాబ్ బోయ్ అందించిన కాఫీకప్పును చేతిలోకి తీసుకున్నాడు కృష్ణారావు.

ఇష్టమున్న వాళ్ళని, లేనివాళ్ళని అందరిని కదలకుండ కూర్చోబెట్టి, అందరి దృష్టిని ఆకర్షించి, ముందుజీవితంలో వాళ్ళకెందుకూ పనికిరాని శాస్త్ర విషయాలను అతి కష్టంమీద వాళ్ళ బుర్రల్లోకి ఎక్కించి, వాళ్ళ అనాసక్తితో తన వాగ్ధాటిని పోటీపెట్టి, క్లాసునుండి తిరిగొచ్చేసరికి యుద్ధరంగంనుండి వచ్చినట్లు ఫీలవుతాడు.

ఈ రోజు తనకిక క్లాసులు లేవన్న విషయం గుర్తుకొచ్చి, తృప్తిగా నిట్టూర్చి కాఫీ సిప్ చేశాడు.

ఇంక మూడుగంటలు గడపాలి కాలేజీలో.

స్టాఫ్ రూంలోకెళ్తే, లోకాభిరామాయణంతో మూడు నిమిషాల్లా గడుస్తుంది కాలం.

ఈ రోజైన ఉత్తరం వ్రాయాలన్న విషయం జ్ఞాపకం వచ్చింది.

కాగితం, కలం తీసుకుని ప్రారంభించాడు.



మహారాజశ్రీ తండ్రిగారికి, మీ కుమారుడు కృష్ణారావు నమస్కరించి, మీ క్షేమ సమాచారములు తెలియజేయగోరుతూ, వ్రాయునది—

కలం కదలడం ఆగిపోయింది.

ఏం వ్రాయాలి,—తర్వాత—

వ్రాయవగు ముఖ్యవిషయాలేవీ కన్పించడంలేదు. తన భార్య సావిత్రికి ఒక రోజు జ్వరం తగిలి తగ్గింది. ముఖ్య విషయం కాదు. పెద్దమ్మాయి సునీత మారాం చెయ్యకుండాబడికెళ్తోందిఇప్పుడు. వ్రాయతగినదేమీ కాదు. కమిటీవాళ్ళు తమకు రెండునెలల జీతం బకాయిపడ్డారు. ఎప్పుడు ఉండేదే....మరేం వ్రాయాలి....

ఉత్తరం వ్రాయలేదు....లేదు....అనే తపనగాని ముఖ్య విషయాలుంటే తను వ్రాయడా?....

తల్లిదండ్రుల మీద ఎక్కడలేని విసుగొచ్చింది కృష్ణారావుకి.

"హల్లో కృష్ణా! ఒక ఎత్తు వేద్దామా"— ఇంగ్లీష్ లెక్చరర్ ప్రేమస్వరూప్ వచ్చి కూర్చున్నాడు.

ఎప్పుడులేంది, నిన్న తననుఓడించాడు. ఏమైనాసరే, ప్రతీకారం తీర్చుకోవాలి—

ఉత్తరం ప్రక్కన పడేసి, చెస్‌బోర్డు మీద కాయిన్స్ సర్దడం ప్రారంభించాడు కృష్ణారావు.

ఆట అయ్యేసరికి లాంగ్‌బెల్ కొట్టారు.

క్లబ్ కెళ్ళి ఇంటికి చేరేసరికి తొమ్మిదయింది. స్నానం, భోజనం ముగించి పడుకునేసరికి పది.

ఉదయం మధ్యలో ఆపిన ఉత్తరం గుర్తొచ్చింది.

రేపు—

"రేపు పూర్తి చేయాలి" అనుకున్నాడు.

అలాంటి రేపులు చాల గడవాలని అతనికి తెలుసు.

కాని, అదేమంత పెద్ద ఆలోచించదగిన విషయంగా కన్పించలేదతనికి.

* * *

ఉదయం బాగా వర్షం కురిసింది.

పదింటికి ఆగిపోయింది కాని. మబ్బులు విడిపోలేదు. ఈదురుగాలి వీస్తూంది. వర్షం అప్పుడే పోయే సూచనలేం లేవు.

భోజనం అయిపోయిన తర్వాత ఒక కునుకు తీద్దామని పడుకున్నాడు భూషయ్య.

నిద్ర పట్టలేదు.

లేచి చుట్ట ముట్టించాడు.

ఎవరింటికో వెళ్ళిన సీతమ్మ వచ్చి. మంచాన్ని ఆనుకుని కూర్చుంది.

"ఎక్కడికి వెళ్ళావూ?"

"రాఘవయ్యగారింటికి బంధువులొస్తే చూసొద్దామని."

భూషయ్య ఏం మాట్లాడలేదు. చాలా సేపు మౌనంగా గడిచిపోయింది.

"వాళ్ళేమన్నారో తెల్సా" అడిగింది సీతమ్మ.

"ఏమిటి?"

"మీకు ముగ్గురు కొడుకులుకదా. వాళ్ళ దగ్గరుండక ఎందుకిలా ఒంటరిగా—"

"నువ్వేం చెప్పావ్?"

"ఏం చెప్తాను, నా ముఖం .... మాట మార్చాను.... ఈసారి పెద్దబ్బాయి వచ్చినప్పుడడగండి మనల్ని తీసుకెళ్ళమని"—

"అలాగే"—

"ఇప్పుడట్లాగే అంటారు, వచ్చినపుడు నోరు మెదపరు."

భూషయ్య చుట్టపారేసి మంచినీళ్ళడిగాడు

ఆమె లోపలికి వెళ్ళింది.

ఏమడగాలి వాళ్ళను–తెలియదా ....కష్టమొచ్చినా సుఖమొచ్చినా పలుకరించి, పంచుకునే దిక్కులేరని. తనేమని అడుగుతాడు....తనకభిమానం అడ్డు .... వాళ్ళకు స్వార్థం.... తమను తీసుకెళ్తేఖర్చులు పెరుగుతాయని.

సీతమ్మ మంచి నీళ్ళందించింది.

"మనల్ని తీసుకెళ్ళినంత పుణ్యం. వారానికొక ఉత్తరం వ్రాస్తే"—భూషయ్య అన్నాడు.

'చిన్నబ్బాయి వ్రాసింది మొన్నేగ–'

"ఎప్పుడు మొన్న–రేపు గురువారానికి నెల. రెండోవాడు వ్రాసి యెన్ని నెలలో–పెద్దాడికి అసలు వ్రాసే అలవాటే లేదు."

"ఏవో పనులుంటాయి" సమర్థించింది సీతమ్మ.

"గొడుగు పట్టుకురా."

"ఎందుకు?"

'పోస్ట్‌మాన్ వచ్చి నాలుగురోజులైంది ఉత్తరమేమైన వచ్చిందేమో వెళ్ళి కనుక్కొస్తా.'

'ఈ బురదలోనా' అందేకాని గట్టిగా అభ్యంతరం చెప్పలేదు. వెళ్ళి గొడుగు తెచ్చి యిచ్చింది.

గొడుగు నిండా మాసికలు. ఎప్పుడో వేసిన మాసికలూడిన చిల్లులు.

"సూది దారం తీసుకురా."

గొడుగు బాగుచేస్తూ కూర్చున్నాడు రామయ్య.

చిన్నాడు వెళ్ళిపోయి రెండేళ్ళయింది. అప్పటి నుంచి దయ్యాల కొంపలా ఇల్లు పాడు పడింది. తామిద్దరమే గతాన్ని తవ్వుకుని. పాత రోజుల్ని నెమరువేసుకుంటు. ఒకర్ని ఒకరు పూరడించుకుంటు, చుట్టూ అలుముకున్న వొంటరితనాన్ని. వయసు భారాన్ని, చిన్న చిన్న సంభాషణలతో

# ఎండిపోయిన కొమ్మలు

కొవ్వూరి



ఛేదించాలని ప్రయాస పడుతూ— పెద్దవాళ్ళిద్దరు ఉద్యోగాలు చేస్తున్నారు. వ్యవసాయం చేసుకుంటు తమకు తోడుంటాడని చిన్నవాడిని చదువు మాన్పించి పనిలో పెట్టాడు. వాళ్ళుటౌన్లోవుంటేతనెందుకు పల్లెలో వుండాలి. తన పిల్లలు మాత్రం కాన్వెంట్‌లో చదువుకోవద్దా?- వాడు వెళ్ళిపోయి టౌన్లో వ్యాపారం పెట్టాడు.

వాళ్ళనుండి వచ్చే ఉత్తరాల కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూపే తామిద్దరు ఇక్కడ మిగిలిపోయి....

"జాగ్రత్త! కాలునొప్పి అంటున్నారు. బురదలో చూసి నడవండి" గొడుగు వేసుకుని వెళ్తున్న భూషయ్యను సీతమ్మ హెచ్చరించింది. సన్నగా చినుకులు పడుతున్నాయి.

నెమ్మదిగా అడుగు వేశాడు.

బురదలో కాలు ఎక్కువ దిగడం లేదు కాని, జారుతుంది. జాగ్రత్తగా నడవాలి అనుకున్నాడు.

ఊరు దాటాడు.

చుట్టు వరిచేలు చేలగట్లు తెగిపారిననీరు రోడ్డు మీద నిలిచింది. పోస్టాఫీసు పక్క ఊరిలో ఉంది. రెండు మైళ్ళ దూరం

## "మనసులోని మాట"

మనసు నీది—మమత నీది
మమతలోని—మనువు నీది
నాపాట నీది—పాటలోని పల్లవి నీది
నువ్వెందరికో వున్నా—నీ ఉనికి నాది
ఉయ్యాల లూగించావు—ఊహలవల
వేయించావు
ఈపయనం ఎందుకో—ఎంతవరకో
ఆశతో వుందాం-ఆత్మీయతతో జీవిద్దాం
అదే స్నేహానికి అర్థం—జీవిత
పరమార్థం.

—సుధాకర్

---


పోస్ట్‌మాన్ ఎప్పుడో వారం, పదిరోజులకు ఇష్టమొచ్చినపుడు ఉత్తరాలుతెస్తాడు. ప్రతిరోజు వస్తున్నట్లు సంతకాలుపెట్టించుకుంటాడు. వర్షం పెరిగింది.

గొడుగు ముఖాన్ని మాత్రమే కప్పుతోంది.

దారి సరిగ్గా కనబడటంలేదు.

జారి పడబోయి కాలు నిలదొక్కుకున్నాడు. కొద్ది దూరం నడిచి నందుకే రొప్పు వచ్చింది. తన పని అయిపోయిందనుకున్నాడు భూషయ్య. తన చేతుల మీదుగ ఎందరు పెరిగారు. ఒక్కరు.... ఒక్కరు.... తన కానరాగ ఇప్పుడుంటే?

తల్లి దండ్రులు చిన్నప్పుడే పోయారు. ముగ్గురు తమ్ముళ్ళను, ఇద్దరు చెల్లెళ్ళను పెంచి పెళ్ళిళ్ళు చేశాడు. ఆస్తి దగ్గర తగాదాపడి తమ్ముళ్ళు విడిపోయారు. వాళ్ళిప్పుడు సరిగ్గా పలకరు తనతో.... ఒకప్పుడు తనంటే గౌరవం, అభిమానం, ఎదురు మాట్లాడి ఎరుగరు. ఇప్పుడు? తనేదన్నా చెబితే ప్రక్కకుతిరిగి నవ్వుకుంటారు. తన పిల్లలు-? వాళ్ళకోసం వున్న ఊరొదిలి దూరంగ ఈ అడవిలోకి వచ్చి చౌకగ పొలాలుకొని, బాగుచేసి, తన శ్రమతో వాళ్ళను యెక్కదీసి, చదివించి, ప్రయోజకుల్ని చేశాడు తనిప్పుడు వాళ్ళ కవసరంలేదు. వాళ్ళకు భారం కావాలని తన ఉద్దేశ్యం కాదు కాని, తను వాళ్ళకు పంచి యిచ్చిన ప్రేమ, అభిమానం వీటిని గుర్తించగలిగి, ఒక మంచి మాట, ఒక తియ్యని పలుకు, సంవత్స



సినీ తారలు
శ్రీదేవి,సుజాత,జయసుధ,జయప్రదం ఫొటోలసెట్టు 5రూ.ఎ.యన్నార్,ఎన్టీఆర్, శోభన్‌బాబు,కృష్ణ,కృష్ణంరాజుల ఫొటోల సెట్టు 6రూ. తెలుగు,హిందీతారల అడ్రసులు(ఫోనునంబర్లతోసహా) గల పుస్తకం 2రూ.ఎం.ఓ.చేయండి!
వై.కె.మూర్తి
దాసరివారివీధి, విజయవాడ-2


లావణ్య టాల్కం పౌడర్

పవిత్ర రుద్రాక్ష
1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించె శ్రేష్ట మైన రాళ్ళు లభించును. కోరినవారికి దరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.
Shree Jagdamba Bhawan
(A. J.) SONEPAT-131001.

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయవలసరంలేదు. హస్త ప్రయోగం,నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్,
టి. వి. రోడ్, తెనాలి. ఫోన్ : 700. 1010

రానికి ఒకటి రెండుసార్లు వచ్చి పలుకరించి తన భారాన్ని పంచుకో గలిగితే-!

పెద్దగ గాలి వీచింది.

గొడుగు ఎగిరిపోయింది.

అందుకోవాలని త్వరగ అడుగువేయబోయాడు.

కాలుజారి బురదలబడ్డాడు.

నడుము కలుక్కుమంది.

* * *

వళ్ళంత బురదతో,

చిన్నగ అడుగులు వేస్తు వచ్చిన భూషయ్యను సాదరంగ ఆహ్వానించి-బల్లమీద కూర్చొనున్నాడు పోస్ట్ మాస్టరు.

"ఈ వానలో రాకపోతే ఏమండీ.... ఏమన్నా వుంటే నేను పంపిస్తాగా...."

"మీరా! సరేలే సరిగా, వుంటేనే వారం వారంకదా. వర్షంలో ఎన్ని రోజులకో? అసలు రావడం తప్పుతుందని మా లెటర్సి మీరు దాచిపెట్టున్నారేమో."

"వాళ్ళు వ్రాస్తే నేనే ఇవ్వడం లేదంటారా. ఇక ఒక పని చేస్తాను. నేనే వ్రాసి పంపిస్తాను. సరేనా.... కొద్దిసేపు కూర్చొండి. పోస్టింకా రాలేదు."

క్రితంరోజు పేపరు చూస్తూ కూర్చున్నాడు భూషయ్య.

"పిల్లలు పండక్కి రాలేదా" పోస్ట్ మాస్టరడిగాడు.

"లేదు- బహుశా సంక్రాంతి కొస్తారేమో" భూషయ్య సందేహంగా సమాధానమిచ్చాడు.

రారు— ఎందుకొస్తారు..

ఎండిపోయిన కొమ్మలు—

రెక్కలొచ్చి ఎగిరిపోయిన పిట్టలు. ఏమాసించి, వాలతాయి ఆకులు రాలిన చెట్టుమీద—

అనుకున్నాడు పోస్టుమాష్టరు.

* * *

ఎండకు ఎండి, వానకు చివికి, వయసుకు రంగుపోయి, నల్లబడిన గడ్డివరకలు చూరునుండి కన్నీటి బిందువులను కారుస్తున్నాయి.

వాటి దేహాలలోని—

చివరి సారాన్ని పిండుకుని ఎర్రగ క్రిందికి జారే వానబిందువులు రక్తాశ్రువులులాగా వున్నాయి.

సీతమ్మ వెలిగించిన లాంతరు కాంతి పుంజాలు, రాత్రి కార్చే చీకటి, చినుకుతో పోటీపడి ఓడిపోతున్నాయి.

పంచలో ముత్తకానుకుని కూర్చున్న ఆమె ఒంటరి మనస్సులో ముసురుకునే

## ఒఖ్ఖణ్ణే - నే నొఖ్ఖణ్ణే

నా పేగుల్ని సాగదీస్తూ
నే మీటుతున్న రాగాలు
నా లాగే
అస్తవ్యస్తంగా
నా గుండెమీద దరువులు —
ఏవో జ్ఞాపకాలు
ఏవేవో బాధల శిథిలాలయాలు
చుక్కల్ని కలుపుతూ నా ప్రయాణాలు
మధ్య చురికీల నిర్దాక్షిణ్యాలు
గుండెలో మంటలు పైకెగసి
మెదడులో విహంగాల రెక్కలుతెగి
మనసునిండా నెత్తుటి మరకలు
మమతల వేళ్ళుతెగి—
నే నెక్కడో
ఆకాశానికీ-ఆశయాలకీ మధ్య
పచ్చిగా-దారుణంగా
నా చుట్టూ ఎదుగుతున్న
యదార్థం మధ్య
నా గాయాలకి
నేనుకూడా మందు రాసుకోలేక
ఒఖ్ఖణ్ణే
నే నొఖ్ఖణ్ణే
ఎక్కడికో ?
నే నెక్కడికో ? ? ! !

— భైరవయ్య

చీకటి రాత్రికన్న మరింత చిక్కగవుంది.

"నిన్నే- వినిపించడంలా?" భూషయ్య పిల్చాడు.

"మీరా, ఏమిటా బురద? పడ్డారా?"

"కాలు జారిందిలే....నీళ్ళు పెట్టు."

స్నానంచేసి పొడిబట్టలు కట్టుకుని, ఒణుకుతు కూర్చున్నాడు భూషయ్య కప్పుకున్న దుప్పటి వొణుకును తగ్గించలేకపోతుంది.

"ఇంత సేపున్నారేం-?...."

"పోస్ట్ ఆలస్యంగా వచ్చింది."

"ఉత్తరం వచ్చిందా?"

"లేదు—"

ఒణుకుతున్న చేతుల్తో నెమ్మదిగా చుట్ట చుట్టుకున్నాడు.

చివర కొరికి బైటికి ఊసి-

"అగ్గి పెట్టిస్తావా?" అన్నాడామెవైపు చూసి.

కళ్ళల్లో ఉబికే కన్నీటి పొరలను అతి కష్టంమీద ఆపుకుని తల పైకెత్తిందామె.

ఆ ముఖం ఆయన మనసును కదిలించి వేసింది.

సంవత్సరాలకొద్ది వానకోసం ఎదురు చూసి ఆశలు బీటలు వారిన, ఎండిపోయిన నేలలా ఉందామె ముఖం—

"ఉత్తరమొచ్చింది" అన్నాడు చిన్నగ.

"హాస్యమాడుతున్నారా?"—అందామె.

"కాదు ....నిజంగా .... కావాలంటే.... చదువుకో ....ఆ చొక్కా జేబులో ఉంది"—

గబగబా లేచి విడిచిన చొక్కా జేబులో ఉన్న ఉత్తరం తీసుకొచ్చి లాంతరు ముందు చతికిలబడి. ప్రతి అక్షరాన్ని చూపులతో తడిమి, నిమిరి, లాలించి, తృప్తిగ నిట్టూర్చి—

"చదవండి....నాకే చదువొస్తే, మీరిలా ఆటలు పట్టించేవారేనా?" అంటు భూషయ్యకందించింది.

"ఔను- ఎవరు వ్రాశారు?" అడిగింది.

"పెద్దబ్బాయి- అంత బాగానే వున్నారట."

"అలాకాదు నాకు సాంతం చదివి వినిపించాల"

"అంతా బాగానే వున్నారు. అమ్మ నడిగినట్లు తెలపండి."

"అమ్మ జ్ఞాపకం వుందన్నమాట."

"నన్ను చదవనిస్తావా లేదా?"

ఆమె మరిక మాట్లాడలేదు.

"అమ్మ నడిగినట్లు తెలపండి. మీ కోడలు నమస్కారాలు చెప్పమంది. సునీత బడికి వెళ్తోంది. నాయనమ్మ, తాతయ్య అంటూ కలవరిస్తుంది. బాబు ఆరోగ్యంగానే వున్నాడు. రఘు ఏదో పనిమీదఇక్కడకు వచ్చి నన్ను కలిశాడు. సంక్రాంతికి ఊరికి వస్తామన్నాడు. మేము సంక్రాంతికి వస్తాము. గుంటూరు వెళ్ళి శేషుతో కలిసి అందరము వస్తాము. సెలవులు ఎక్కువలేక దీపావళికి రాలేదు. మీ ఆరోగ్యము జాగ్రత్తగా కాపాడుకోవలెను. ఇంతే సంగతులు."

భూషయ్య ఉత్తరం చదవడం ఆపాడు.

సీతమ్మ ఆనందానికి అవధులు లేవు.

పిల్లలు వస్తున్నారు, వస్తున్నారు- అని ఆమె హృదయంలో ప్రతి అణువు ఆనందాతిశయంతో కేకలు వేసింది.

"ఏమండీ — నవ్వారు తేవాలి మీరు- మంచాలు చాలవు-అల్లించాలి. దుప్పట్లు కూడ చాలవు రెండన్న కొనండి. ఇంట్లో వెచ్చాలు—"

"ఇదిగో—"

"ఏమిటి?"

"సంక్రాంతి ఇంక నెలాపదిహేను రోజులుంది. ఏమిటా తొందర-"

"ఇంక, యాభై రోజులు గడవాలా—"

సీతమ్మ నీరసపడింది—

"ఎక్కడికి వెళ్తున్నారు-" గొడుగు తీసుకుని బైటికి వెళ్తున్న భూషయ్యనడిగింది.

"ఇప్పుడే వస్తాను"—చీకట్లో బైలుదేరాడు.

రాఘవయ్యగారి కొచ్చిన ఉత్తరం తెల్లారి ఇవ్వొవచ్చులే అనుకున్నాడు ముందు—రేపు ఉదయం ఏదైన పనిలోబడి మర్చిపోతే, తనటు వెళ్ళిన వెంటనే మళ్ళీ ఎవరిచేతనైన చదివించుకుంటుంది. అప్పుడు తన మోసం బైటపడ్తుంది. అందుకనే ఇప్పుడే వెళ్ళి ఆ ఉత్తరం యిచ్చేసి రావాలి.

సీతమ్మ ముఖంలో నిరాశ భరించలేక చిన్న అబద్ధం ఆడాడు భూషయ్య.

రేపు గట్టిగ వ్రాయాలి—

ఉత్తరాలు వ్రాయమని ముగ్గురు కొడుకులకు తమ ఆవేదన వ్యక్తంచేస్తూ —

సమాధానం రావచ్చు.

వస్తుందా?—

ఏమో! మరి!—


వెలువడింది!

చందుసోంబాబు ప్రేమజ్వాల



అరుణా పబ్లిషింగ్ హౌస్

ఏలూరురోడ్డు • విజయవాడ-2

15.00 M.O. చేయండి. 50 పై. పెట్టి V.P.P.లో పంపగలము.